
# పున్నమి లేని చంద్రుడు

**- కొత్తపల్లి ఉదయబాబు**



ఆశీర్వాదం లోపలికి వస్తూ "నమస్తే గురువుగారూ"అన్నాడు.

"రావోయ్ రా!" అంటూ ఆహ్వానించాడు.

"మీతో చెప్పానే! వీడే నా మేనల్లుడు- ఖమ్మం జిల్లాలో ఓ మారుమూల పల్లెలో ఒక బీద కుటుంబం. మా బావ పొలంలో పని చేస్తుండగా పాము కాటుతో చనిపోయాడు. మా అక్కని, పిల్లలిద్దరినీ పువ్వులలో పెట్టి చూసుకునేవాడు. పెద్దది అమ్మాయి. అతనుండగానే పెళ్ళిచేసేశాడు. అల్లుడు కూడా చాలా మంచివాడు. తర్వాత వీడు, బాగా చదువు అబ్బలేదు. పదో తరగతి లెక్కలు ఉండిపోయింది. నాకు మన సర్కిల్‌లో మీరు గుర్తొచ్చారు. మీ దగ్గర పర్మిషన్ తీసుకున్నాకనే వాడిని రమ్మని ఫోన్ చేశాను. వాడి పేరు ఏకాంబరం." అంటూ పిల్లవాడిని నాకు పరిచయం చేశాడు.

పదిహేడేళ్ళుంటాయి ఆ అబ్బాయికి.

కాయకష్టంతో పెంచిన శరీరంలా హార్డ్‌గా, స్లిమ్‌గా ఉన్నాడు. పచ్చగా పసిమి జీన్స్ ఫాంట్, రెడ్ కలర్ టీ షర్ట్ వేసుకున్నాడు.

రెండు చేతులు జోడించి నమస్కరించబోయి వంగి నా పాదాలకు స్పృశించాడు.

"సరే నాన్నా! నీ పేరు?" అడిగాను- ఆశీర్వాదాన్ని పరిశీలిస్తూనే.

"ఏకాంబరేశ్వరరావు సర్!" అన్నాడు వినయంగా చేతులు కట్టుకుని.

"గుడ్. మేథ్స్‌లో ఎన్ని మార్కులొచ్చాయి?"

"తర్టీఫోర్."

"ఏ ఎదవ దిద్దాడోగాని ఆ ఒక్క మార్కు వేసి ఉంటే పరీక్ష పాసై ఈపాటికి కాలేజీలో చేరి ఉండేవాడు గురువుగారూ! మన మేట్లర్లే మనకి ఉపయోగపడదు సార్!" అన్నాడు ఆశీర్వాదం.

అక్కడ అతనికి వివరణ యివ్వడం అవసరం అనిపించింది.

"బాబూ! నువ్వు కూర్చుని నీకు వచ్చిన అయిదు లెక్కలు ఎక్కించుకుని జవాబులు వ్రాయి. నేను అంకుల్‌తో మాట్లాడుతూ ఉంటాను" ఏకాంబరంతో అని, తోటి ఉపాధ్యాయుల పట్ల ఎంత గౌరవభావం ఉందో గ్రహించిన నేను వీధిలోకి వచ్చాను. విధి లేక నా వెనుకే అనుసరించాడు ఆశీర్వాదం.

"ఆ బాబు పేపరు దిద్దిన ఉపాధ్యాయుడు ఎవరో నీకు తెలుసా?" అడిగాను.

"తెల్వదు సార్!"

"మరి ఎదవ... అని ఏదేదో అంటున్నావ్? మన తోటి ఉపాధ్యాయుల్ని మనమే గౌరవించుకోకపోతే వేరే ఎవరో మనని ఎలా గౌరవిస్తారు చెప్పు?" ఆమాట అన్న తీరుకి కాబోలు ఒక్క క్షణం తప్పుచేసిన వాడిలా తల దించుకుని అంతలోనే తలెగరేశాడు ఆశీర్వాదం. అతని తత్వం నాకు తెలుసు. అందితే జుట్టు- అందకపోతే కాళ్ళు అనే పద్ధతి. రెండుమూడు సందర్భాలలో అతని గురించి నేను అర్థం చేసుకున్నది అదే!

"నీకు పబ్లిక్ పరీక్షలలో వేల్యుయేషన్ చేస్తారో తెలుసా?"

"తెలీదు గురువుగారూ!"

"విషయం తెలియకుండా అవతలివారిని నిందించడం వల్ల రెండు నష్టాలు జరుగుతాయని నా నమ్మకం. నీకు పాపభీతి అంటే తెలుసా!"

"అయ్యో! ఎందుకు తెలీదు సార్! అందుకేగా ఏదైనా పాపం చేశాననిపిస్తే వెంటనే ప్రార్థన చేసేసుకుంటాను."

"గుడ్. అనవసరంగా యితరులను నిందిస్తే పాపం అంటుకుంటుంది. రెండోది అవతల వ్యక్తి గురించి మనం తెలుసుకోకుండా మాట్లాడిన తొందరపాటుదనానికి మనమంటే ఎదుటివారికి చులకన భావం ఏర్పడుతుంది. పబ్లిక్ ఎగ్జామ్స్ ప్రారంభం కాబోయే ముందే ఏ సబ్జక్టు పేపరు ఏ జిల్లాకు పంపాలో పరీక్ష నిర్వహించే అధికారులకి సూచనలు అందుతాయి. అలా లెక్కలు పేపర్-1 ఒక జిల్లాకు; లెక్కలు పేపర్-2 మరొక జిల్లాకు వెళ్తాయి. ఈ పరీక్షలు పూర్తయ్యాక స్పాట్ వేల్యుయేషన్ మొదలవుతుంది.

పేపర్లు దిద్దాకా ఆయా సెంటర్ నుంచి మార్కులు మాత్రమే హైదరాబాద్ చేరతాయి. పేపర్ వన్‌లో పద్దెనిమిది వచ్చి పేపర్ టులో పదహారు వస్తే టోటల్ చేసినపుడు ముప్పయి నాలుగు అవుతాయి. దాంతో ఆ సబ్జక్టులు ఆ విద్యార్థి ఫేలయినట్లు అర్థం అవుతుంది. విద్యార్థి వ్రాసిన దానికే మార్కులు వేయడం జరుగుతుంది గాని రాయని ప్రశ్నకు మార్కులు వేయరు కదా! పేపర్ వన్ దిద్దే టీచర్‌ది ఒక జిల్లా, పేపర్ టు దిద్దే టీచర్‌ది మరో జిల్లా. మరి ముప్పయినాలుగే వేసాడని ఉపాధ్యాయున్ని తిట్టుకుంటే లాభం ఏముంది?

అందుకే ఏ ఉపాధ్యాయుడు పేపరు దిద్దినా ఏబైకి యిరవై వచ్చేలా వ్రాయమని విద్యార్థులకి సూచిస్తుంటాను నేను. మనలో సరుకు లేకుండా మార్కులు వేయలేదని ఉపాధ్యాయుల్ని నిందించడం మంచిది కాదు. మనల్ని మనమే గౌరవించుకోకపోతే నీ మాటలు విన్న కుర్రాళ్ళు మనల్ని ఎలా గౌరవిస్తారు చెప్పు?" అన్నాను.

"సారీ సర్! వాడిని మీ చేతుల్లో పెట్టాను. యిక మీదే బాధ్యత. వస్తా బై!" అనేసి వెళ్ళిపోయాడు ఆశీర్వాదం.

నేను ఏకాంబరం దగ్గర కుర్చీలో కూలబడ్డాను.

అప్పటికే అతను తనకు తెచ్చిన అయిదు ప్రాబ్లమ్స్‌ను నోట్ బుక్‌లో ఎక్కించి చేసి ఉంచాడు. నాకు అర్థమైనదేమిటంటే-

అతనికి ప్రాథమికాంశాలు తెలీదు.

లెక్కచేయడంలో కొన్ని కొండ గుర్తులు పెట్టుకుని స్టెప్స్ వేస్తున్నాడు.

అయితే ఒక స్టెప్ కరెక్ట్ అయితే మరో స్టెప్ తప్పు.

దాంతో నాలుగు మార్కుల సమస్యకు ఒకటి- ఒకటిన్నర మార్కులు మాత్రమే పడుతున్నాయి. దాంతో పరీక్ష తప్పాడు.

నేను ఒక అధ్యాయం తీసుకుని ప్రాథమికాంశాలు అన్నీ ఉదాహరణలతో వివరించాను. ఒక సమస్య తీసుకుని అందులో ఏయే ప్రాథమికాంశాలు ఉపయోగించాలో ప్రశ్నలద్వారా రాబట్టాను. అనంతరం అలాంటి మరొక సమస్య యిచ్చి చేయమన్నాను.

అతను నేను అనుకున్న విధంగా చేసి చూపించాడు.

వెరీగుడ్ అని మెచ్చుకుని మరో మోడల్ చెప్పాను. దానినీ కరక్టుగా చేసి చూపించాడు. ఈసారి 'వెరీగుడ్'అని వ్రాసాను.

అతని ముఖంలో నా పట్ల ఏదో పవిత్రభావం, కళ్ళల్లో అద్భుతమైన మెరుపు మెరిసి మాయమయ్యాయి.

"మీరు నేరం చెబుతున్నాను అనుకోకపోతే ఒక మాట సార్!" అన్నాడు ఏకాంబరం.

"చెప్పు నాన్నా!" అన్నాను చిరు నవ్వుతో.

"మా లెక్కల సార్ యిలా ఏనాడూ ఒక్క లెక్క చెప్ప లేదు సార్! యిలా బోర్డుమీద చేసేసి అలా చెరిపేస్తారు సార్! అందుచేత ఆయన వ్రాయడం మొదలుపెట్టిన వెంటనే లెక్కలు ఎక్కించుకోవడం మొదలుపెడదాం. దాంతో ఆయన వ్రాస్తూ చెప్పేది మాకు అర్థంకాదు. లెక్క ఎక్కించకపోతే నోడ్సు రాయలేదేం అని చితకబాదేస్తారు సార్!"

"చూడు నాన్నా! ఒక్కొక్కరు ఒక్కొక్క పద్ధతిని అనుసరించి పోతుంటారు. వారిని విమర్శించే హక్కు మనకు ఎక్కడిది చెప్పు?" అన్నాను- నిజానికి ఈ విమర్శ నేను ఎంతో మంది గణిత ఉపాధ్యాయుల గురించి విన్నాను.

"మరోమాట సార్!"

"చెప్పయ్యా!"

"ఏరా, పోరా, ఎదవా! యింకా కోపం వస్తే... బూతులు కూడా తిట్టేవారు సార్! విద్యార్థికి మీరిచ్చే గౌరవం చూస్తుంటే నేను మీ శిష్యుడిని ఎందుకు కాలేకపోయానా అని బాధపడుతున్నాను సార్!"

"చూడు నాన్నా! అవన్నీ నీ మంచికి అనుకోగలిగావు కాబట్టే అయిదు సబ్జక్టులు పాసయ్యావు. ఆ సార్ సంగతి మరిచిపోయి నేను చెప్పేది శ్రద్ధగా చదువు. విద్యార్థికి ఉండాల్సిన మౌలిక లక్ష్యం చదువుకునే అంశం పట్ల అభిరుచి కలిగి ఉండటం. ఎక్కడ అనుమానం వచ్చినా నివృత్తి చేసుకోవడం. సరేనా! ఈవేళ నువ్వు నేర్చుకున్నవన్నీ రేపు నాకు చూడకుండా చేసి చూపించాలి సరేనా!"

"సరే! సార్."

"ఈవేళ్టికి చాల్లే" అని పంపేశాను.

❋ ❋ ❋

మరునాడు వస్తూనే క్రితంరోజు నేను చెప్పిన సమస్యలన్నీ కాగితం మీద ఎక్కించుకుని టెస్ట్ వ్రాసాడు. ఇరవై అయిదు మార్కులకు ఇరవై మూడున్నర మార్కులు వచ్చాయి. యిటువంటి విద్యార్థుల స్థాయికి దిగి ఉపాధ్యాయుడు బోధిస్తే ఉత్తీర్ణతా ఫలితాలు బాగుంటాయి అనుకున్నాను.

యధాలాపంగా పేజీలు తిప్పుతుంటే ఫస్ట్ పేజీలో అతని పేరు క్రింద వ్రాసుకున్న వాక్యాలు నన్ను ఆకర్షించాయి.

"మై మోటో ఈజ్ నాట్‌వోన్లీ పాస్ ది ఎగ్జామ్స్.

బట్ ఆల్సో టు గెట్ ఎట్లీస్ట్ సిక్స్‌టీ పర్సంట్."

మౌనంగా 'ట్రై టు కీపిటప్' అని వ్రాసి సంతకం చేశాను.

ఒక రెండు గంటలపాటు తీక్షణంగా చదువు చెప్పాక అతని వివరాలు తెలుసుకోవాలని అన్పించింది.

"నీకు అభ్యంతరం లేకుంటే ఒక విషయం అడగనా?"

"అడగండి సార్!"

"మీ ఫ్యామిలీ గురించి చెప్పు!"

"మీకు ఎవరి గురించైనా నేరం చెబితే నచ్చదేమో కదా సార్!"

"నేను నేరాలు అడగడం లేదు" ఉన్న విషయం ఉన్నట్లు చెప్పు. నువ్వేమిటో పూర్తిగా అర్థమైతే నీకు అవగాహన అయ్యే అధ్యాయాలు కష్టమైనవి కూడా చెప్పాలన్నదే నా ఉద్దేశం."

"మా యింట్లో అమ్మ, అమ్మమ్మ, నేను ఉంటాము సార్. అందరమూ కూలికి వెళ్తాం సార్! అక్కకు పెళ్ళిచేశారు సార్. అక్క పెళ్ళయ్యాక నాన్న పొలం పని చేస్తుండగా పాము కాటు వేసి చనిపోయాడు సార్! అమ్మ, అమ్మమ్మ నాకు, అక్కడ అందరమూ కూలి పనిచేసి అటు కుటుంబం జరుపుకుంటూ యిటు కొంత డబ్బు దాచి మగ పిల్లవాడని మామయ్యను బాగా చదివించారు సార్. ఆడ పిల్లను కూడా చదివించండి అని నాన్న ఎప్పుడూ మొత్తుకుండేవాడు సార్! అమ్మమ్మ "ఆడ పిల్లకు చదువెందుకయ్యా! పెళ్ళిచేస్తే యింట్లో పడి ఉంటాది." అని నాన్నగారి నోరు మూయించేది. అమ్మకు అమ్మమ్మ చెప్పిందే వేదం. ఆ అలుసు చూసుకుని మామయ్య చెలరేగిపోయేవాడు.

రెక్కలు ముక్కలు చేసుకుని మామయ్యను ఎం.ఎస్‌సి. చదివించారు. తరువాత రెండేళ్ళు ఫ్రెండ్స్‌తో ఎంజాయ్ చేశాడు. అతను చాలా బాగా చదువుతున్నాడనుకుని కోరిన డబ్బు ఎలాగోలా తెచ్చి పంపించేవారు.

మా యింట్లో ఎవరికీ పెద్ద చదువులు రావని వూర్లో రాఘవయ్య మాష్టారిని పట్నం వెళ్ళి చూసి రమ్మని పంపారు.

ఆయన వచ్చి మామయ్య బండారం బయట పెట్టేరు. ఆయన మామయ్యను కేకలేసి వెంటనే బియిడిలో చేర్పించారు. జాబ్ రాకుండానే దొమ్మరి కాలనీలో డిగ్రీ చదువుతున్న కిరణ్మయిని ప్రేమించాడు. ఉద్యోగం రాగానే పెళ్ళిచేసేసుకున్నాడు.

"అప్పు తీర్చరా"అంటుంది అమ్మమ్మ!

'పెళ్ళాం సరదాలు తీర్చడానికి కాకపోతే పెళ్ళెందుకు చేసుకున్నావ్?" అని అత్త యిద్దరి మధ్యలో నలుగుతుంటాడు.

జీతంలో కొంత అప్పు తీర్చేలా ఏర్పాటుచేశారు మాష్టారు.

"నన్ను నీ దగ్గరకు తీసుకుపో! నన్ను కడదాకా చూస్తానని బావ నోరు నొక్కి, అక్కను ఒప్పించి నిన్ను చదివించాను. కొడుకు ఉండగా తల్లిని కూతురు చూడటమే మిత్రా!" అంది అమ్మమ్మ!

చదువుకోకపోవడమే ఈ పల్లెవాసుల శాపమా? విషయ అవగాహన లేని వారికి, అందునా విషయ పరిజ్ఞానం లేని ప్రజలకు మన చేతుల్లో ఉండే సాయం కూడా చేయలేకపోవడం దారుణం. మంట గలిసిపోతున్న మానవతా విలువలకు యింతకన్నా ఉదాహరణ ఏం కావాలి.

"మీ అమ్మ నా దగ్గర ఉంటే ఉరిపోసుకు చస్తానని అత్త బెదిరింపు!"

"మగ పిల్లాడు చదువుకుని ఉద్ధరిస్తాడనుకున్న నాలాంటి చాదస్తపు ఎదవలకి యీ శాస్తి జరగాల్సిందే- అదే నిన్ను చదివించి ఉంటే నీ బిడ్డలు, నీ కుటుంబం కూడా బాగుపడేవారే! నీకు చదువు చెప్పించకుండా ఉసురుపెట్టినందుకు నాకు తగిన శాస్తే జరిగింది" అని అమ్మమ్మ అమ్మని చూసి ఏడుస్తూ ఉంటుంది.

"కన్నందుకు ఎవడికోసం చదువు చెప్పిస్తారు? ఆయన కష్టపడి చదువుకుని ఉద్యోగం సంపాదించాడు. అందుకేగా మా బతుకు మేం బతుకుతున్నాం"అంటుంది అత్త! మామయ్యకు ఉద్యోగం వచ్చి నాలుగేళ్ళయింది. అప్పు పాతిక వంతు కూడా తీరకపోవడంతో నేనూ మూడేళ్ళ నుంచి సీజనులో కోతలకు వెళ్తాను సార్! సెలవలప్పుడు కూలిగా పనిచేస్తాను సార్! ఆ డబ్బు అమ్మకిస్తాను సార్! యిదీ సార్ నేను, మా కుటుంబం కథ!"

"మరి మీ అమ్మమ్మగార్కి మామయ్య డబ్బు ఏమీ యివ్వడా?"

"యింకా బాగానే ఓపిగ్గా ఉన్నావుగా! పన్లోకి వెళ్ళు!" అంటాడు సార్ మామయ్య.

"ఆ విషయంలోనే మామయ్య అంటే కోపం వస్తుంది సార్! అమ్మ ఎంతో బతిమాలిన మీదట నాకు మీతో లెక్కలు చెప్పించడానికి ఒప్పుకున్నాడు సార్!"

నా హృదయం జాలితో నిండిపోయింది.

"చూడు నాన్నా! నువ్వు ఎక్కువసేపు ఉండ గలిగితే మరో గంట కూడా చెప్తాను. రాగలిగితే రెండో పూట కూడా చెప్తాను. అలా అయితేనే గాని కోర్సు కవర్ కాదు మరి!" అన్నాను.

ఏకాంబరం మరింత సంబరంగా చూశాడు.

"తప్పకుండా వస్తాను సార్!" అన్నాడు.

❋ ❋ ❋

"సార్! మరో అయిదు రోజుల్లో కోర్సు పూర్తయిపోతుందా సార్!" ఏకాంబరం అడిగాడు. అప్పటికి 60% పూర్తిచేశాను.

"ఏం? ఎందుకని?" అడిగాను.

"ఎగ్జామ్స్ ప్రారంభం అయితే హాల్ టిక్కట్ యివ్వరట సార్. అందుకని ప్రారంభం కాకుండానే వచ్చేయమని అమ్మ ఫోన్ చేసింది."

"అదేం లేదే? ఈరోజు పరీక్ష అనగా ఉదయంకూడా వెళ్ళి హాల్ టికెట్ తీసుకోవచ్చునే!" అన్నాను.

"అలా కుదరదని చెప్పారట సార్!"

చదువుకోకపోవడమే ఈ పల్లెవాసుల శాపమా?

విషయ అవగాహన లేని వారికి, అందునా విషయ పరిజ్ఞానం లేని ప్రజలకు మన చేతుల్లో ఉండే సాయం కూడా చేయలేకపోవడం దారుణం. మంట గలిసిపోతున్న మానవతా విలువలకు యింతకన్నా ఉదాహరణ ఏం కావాలి. అనిపించింది నాకు.

"యింతకూ ఏమంటావ్?"

"అందుకుని పరీక్షలు ప్రారంభం అయ్యేముందు రోజుకే అక్కడకు చేరుకోవాలి సార్. మీరు దయచేసి మరో గంట చెబితే..."

నేను నవ్వేశాను.

"అలాగే! దానికంత భయం ఎందుకు చెబుతాను లే!" అన్నాను.

అలా అడిగిన ఏకాంబరం ఆ సాయంత్రమే రాలేదు.

మరుసటి రోజు ఉదయం ముఖం వేలాడేసుకుని వచ్చాడు.

"నిన్న రాలేదేం? ఎన్ని ప్రోబ్లెమ్స్ కరవయ్యేవో తెలుసా?" విసుగ్గా అరిచాను.

"అది కాదు సార్. నిన్న సాయంత్రం కడుపునొప్పి వచ్చింది. అందుకు రాలేదు సారీసార్!" అన్నాడు అపరాధ భావంతో-

"సరేలే! సబ్జక్టు తీసుకో!" అన్నాను.

సబ్జక్టు చెబుతున్నంతసేపు ఎడమ చేతివైపు పొట్టమీద సన్నగా బొటన వేలితో రాసుకుంటూనే ఉన్నాడు.

"ఏం నాన్నా! ఏమైంది బాగా నొప్పిగా ఉందా! డాక్టరు దగ్గరకు వెళ్దామా" అడిగాను.

"నో సార్! అవసరం లేదు. చెప్పండి"- అంటూ చదువులో నిమగ్నమయ్యాడు.

ఏదో దాస్తున్నట్టే అనిపించింది.

అయినా ఆశీర్వాదం చూసుకుంటాడులే అని సర్దుకున్నాను.

చివరి అయిదు రోజుల్లో నాలుగు పూటలు కడుపునొప్పితో ఏకాంబరం రానే లేదు.

చివరిరోజు వచ్చి "ఈ సాయంత్రమే వెళ్తున్నాను సార్!..." అని చెప్పాడు. అప్పటికి డబ్భై అయిదు శాతమే పూర్తిచేశాను.

"పరీక్ష పాసవుతావా!" అడిగాను.

"అరవై మార్కులు తక్కువకాకుండా తెచ్చుకుంటాను సార్!" ఆ కంఠంలో ఎంతో ఆత్మవిశ్వాసం ధ్వనించింది నాకు.

"నిన్ను చేర్చాక మళ్ళీ మీ మామయ్య కనిపించనే లేదు. ఒకసారి కనపడమని చెప్పు!" సంతృప్తి నిండిన కళ్ళతో చూశాను.

(మిగతా 20వ పేజీలో)

(9వ పేజీ తరువాయి)

"సార్! మిమ్మల్ని ఒకటి అడిగి, మీతో ఒకటి చెప్ప వచ్చా?" అడిగాడు తటపటాయిస్తూ-

"పర్వాలేదు. ధైర్యంగా చెప్పు!"అన్నాను వెన్ను తడుతూ.

"మళ్ళీ జన్మంటూ ఉంటే మీకు కొడుకుగా పుట్టాలని ఉంది సార్! యిదే నేను చెప్పదలుచుకున్నది. మీ పాదాలకు నమస్కరించుకోవచ్చా?" అన్నాడు గాద్గదిక స్వరంతో-

వయసు ప్రభావమో, వినయ విధేయతలతో నేను చెప్పిన నాలుగు ముక్కలు నేర్చుకున్నాడన్న అభిమానమో నా కళ్ళు చెమర్చాయి.

ఏకాంబరం నా పాదాల మీద పడి రెండు నిముషాలు అలాగే ఉండిపోయాడు. అతని వెచ్చని కన్నీళ్ళు నా పాదాలను అభిషేకించాయి.

నా మనసు ఆర్ద్రమైంది-

ఉపాధ్యాయుడు ఒక చెట్టు లాంటివాడు. ఆ నీడలోకి ఎందరో వస్తుంటారు సేద తీరిపోతుంటారు. కొంతమంది చెట్టు ఎక్కుతారు. దానితో అభిమానం పెంచుకుని ఆటలు ఆడతారు. యింకా ముందుకు వెళ్ళి దాని పువ్వులు ఫలాలు అందుకుంటారు.

ఏకాంబరం పద్దెనిమిది రోజుల్లో నా మనసు ఫలాన్ని అందుకున్నాడు.

"లే నాన్నా! లే! నీకు మంచి భవిష్యత్తు ఉంటుంది. పూర్తిగా చదువుకు కేటాయించాల్సిన వయసులోనే బాధ్యతను అర్ధంచేసకుని పంచుకున్న మనసు నీది. నీకెప్పుడూ శుభం జరుగుతుంది. బెస్టాఫ్ లక్!"అని ఏకాంబరాన్ని లేవనెత్తాను.

"నా పిల్లలిద్దరూ పెళ్ళిళ్ళయి కాపురాలు చేసుకుంటున్నారు. యింకా అయిదేళ్ళ సర్వీసు ఉంది నాకు. నాకు నీలాంటి విద్యార్థులే మానసిక బలం" అని. "యిది నీకు నా బహుమతి" అని అతని నుదుటి మీద ముద్దాడాను.

"మాష్టారూ! మా కులం..." ఏకాంబరం ఏదో అనబోయాడు.

"మనం లోకులం నాన్నా! యీ బహుమతి నన్ను నీకు గుర్తుచేసి నువు పరీక్ష పాసయ్యేలా చెయ్యాలి!" చేస్తుంది. ఆరోగ్యం జాగ్రత్త! బై!"

ఏకాంబరం మనసు తేలిపోతున్నంత ఆనందంతో వెళ్ళిపోయాడు వెళ్ళలేక వెళ్ళలేక...

సుమారు ఆరు నెలల అనంతరం ఆశీర్వాదం హఠాత్తుగా ఊడిపడ్డాడు.

సైకిల్ దిగుతూనే చేతులు పట్టుకుని బావురుమన్నాడు.

"గురూగారూ! అంతా మా దురదృష్టం. తల రాత..."అంటూ.

"అరె! ఏమైందయ్యా!" అన్నాను.

"మావాడు... అదే మీరు లెక్కలు చెప్పిన శిష్యుడు యిక లేడండీ- పోయాడట." అంతా మా దురదృష్టం."

నేను కొయ్యబారిపోయాను.

"ఎలా... ఎలా..." ఆత్రుతగా అడిగాను.

"24 గంటల నొప్పి... వాడి ప్రాణం తీసింది సార్!"

నాకు ఆరోజు ఏకాంబరం బాధ పడటం గుర్తొచ్చింది.

అంటే ఆ అప్పటికే తరచుగా వస్తుండేదన్నమాట- ఎంత పొరపాటు చేశాను. ఆరోజు నేనైతే డాక్టర్ దగ్గరకు తీసుకు వెళ్ళాల్సింది-

"రాత్రిలోగా ఖమ్మం చేరాలి. ఓ వెయ్యి రూపాయలుంటే అప్పు ఇప్పించండి సార్"- వచ్చాక యిస్తాను"అన్నాడు ఆదుర్దా పడుతూ.

అప్రయత్నంగా తీసి యిచ్చాను.

ఉపాధ్యాయుడు ఒక చెట్టు లాంటివాడు. ఆ నీడలోకి ఎందరో వస్తుంటారు సేద తీరిపోతుంటారు. కొంతమంది చెట్టు ఎక్కుతారు. దానితో అభిమానం పెంచుకుని ఆటలు ఆడతారు. యింకా ముందుకు వెళ్ళి దాని పువ్వులు ఫలాలు అందుకుంటారు.

నా చెవుల్లో చివరిరోజు ఏకాంబరం అన్నమాటలు ప్రతిధ్వనిస్తూనే ఉన్నాయి- "మళ్ళీ జన్మలో మీ కొడుకుగా పుట్టాలని ఉంది సార్!"

***

ఆశీర్వాదం వూరు వెళ్ళిన మరునాడే నాకు ఓ కవరు అందింది. అందులో అయిదు వందల రూపాయల నోటుతోపాటు ఓ ఉత్తరం చదవసాగాను.

"గురుదేవులకు-

ఏకాంబరం నమస్కరించి వ్రాయునది-

పరీక్ష పాసయ్యానన్న విషయం మామయ్య మీతో చెప్పి ఉంటాడు. నాకు 69 మార్కులు వచ్చాయి. యిది మీరు పెట్టిన భిక్ష. ఎందుకంటే మీకు యిమ్మని అమ్మ యిచ్చిన ఫీజు మామయ్య మీకు యివ్వలేదు. నేను అందుకు బాధపడలేదు. అతని తత్వం నాకు తెలుసుకాబట్టి. "ఆయన డబ్బు మనిషి. వెయ్యి రూపాయలు యిస్తే గాని చదువు చెప్పడు. చెబితే మాత్రం పిల్లాడు పాసవ్వాల్సిందే" అని నన్ను అక్కడకు తీసుకు వచ్చేనాడే ఆ డబ్బు; నా దారి ఖర్చులు; నన్ను వారింట్లో ఉంచుకున్నందుకు నెల రోజులకు మొత్తం రెండువేల అయిదు వందలూ పుచ్చుకున్నాడు.

మీకు డబ్బు యివ్వలేదని నాకు అర్థం అయింది. ఆ డబ్బు యిప్పుడు మీకు పంపుతున్నాను. గురుదక్షిణ లేని చదువు అంటదని రాఘవయ్య మాష్టారు చెప్పేవారు.

ఉపాధ్యాయ కులంలో అలాంటి వేరు పురుగులు చేరి చదువనే చెట్టుని చెరుస్తుంటే ఎందుకో బాధగా ఉంది సార్. బాధ అంటే గుర్తుకు వచ్చింది.

నాకు ఈ నొప్పి మామూలు నొప్పి కాదని, అపెండిసైటిస్ అని సంవత్సరం క్రితమే తెలుసు. బయాలజీ లెసన్‌లో వచ్చింది. నేనే చెప్పలేదు ఎవరికీ- అమ్మమ్మ నేను బాధపడుతుంటే ఆ ప్రదేశంలో ఆముదం వెచ్చ చేసి మర్దనా చేసేది. అయినా తగ్గలేదు.

మావంటి బీద కుటుంబాలలో రోగాలు రాకూడదు. వస్తే కుటుంబం మరింత అప్పుల పాలవుతుంది. అందుకే నేను పోతే నన్ను అప్పులు చేసి చదివించాల్సిన అవసరం ఉండదు. అందుకే నేను మీరు అడిగినా చెప్పలేదు. రేపు మా వాళ్ళు కష్టపడి అప్పులు చేసి నన్ను చదివించిన తరువాత, రేపు నాకు భార్యగా వచ్చే వ్యక్తి కూడా అత్తలాగే ప్రవర్తిస్తే మా వాళ్ళ పరిస్థితి ఏమిటి? అని ఆలోచించుకున్నాను.

అందుకే ఎవరికీ చెప్పలేదు.

ఈనాటి విద్యావ్యవస్థకు మీరు గోరంత దీపం లాంటివారు.

మీవల్ల ఎందరో చక్కని విద్యార్థులు తయారుకావాలి.

మళ్ళీ జన్మంటూ ఉంటే మీ కొడుకుగా పుట్టాలి.

పుట్టి బుద్ధెరిగిన తరువాత నేను మా వూరి పొలిమేరలు దాటలేదు ఏనాడు. మీ వంటి గురుదేవుని దగ్గర చదువుకునే అవకాశం కల్పించిన మామయ్యకు కడసారి కృతజ్ఞతలు తెలియచేస్తున్నాను- సెలవు.

పాదాభివందనాలతో-

మీ శిష్యుడు

ఏకాంబరం.

ఒక్కసారిగా పెల్లుబికిన దుఃఖం ఉత్తరాన్ని అయిదు వందల నోటునీ తడిపేసింది.

***

నా డైరీలో మొదటి పేజీలో ఏకాంబరం పంపిన అయిదువందల కాగితం, ఉత్తరం యిప్పటికీ ఉన్నాయి బాల్యంలో నా తెలుగు వాచకంలో మేత పెట్టిన నెమలీకలా. ★

## పొదుపు!

ప్రపంచంలోని అధిక ధనవంతుల్లో ఇన్‌గ్వార్ కాంప్రాడ్ నాల్గవవాడు. అంత శ్రీమంతుడు కూడా 15 సంవత్సరాల నాటి కారులో ప్రయాణం చేస్తూ ఉంటాడు. ఆ డొక్కు కారు ఏమిటి అని అడిగితే, తన ఆఫీసు సిబ్బంది పొదుపు పాటించడం కోసం, ధనాన్ని వృధాగా ఖర్చుచెయ్యవద్దని పరోక్షంగా చెప్పడానికి తను ఆ ముసలి కార్లో ప్రయాణం సాగిస్తున్నానని ఇన్‌గ్వార్ సెలవిచ్చాడు.

## LUNCHEONఅంటే...

మనం మధ్యాహ్న భోజనానికి వాడే lunch అనే దానికి formal రూపమే ఈ luncheon అనేది. సాధారణంగా, ఖరీదైన హోటళ్ళలో మర్యాదగా వాడే పదం ఇది. ఇక దీని అర్థం విషయానికొస్తే, లంచ్ అంటే మనం కాలేజిలలో పట్టుకువెళ్ళే అన్నం, పప్పు, కూర కానే కాదు. నిజానికి luncheon అంటే ఓ రొట్టె ముక్క, త్రాగడానికో చుక్క. Lunch అంటే "a lump of bread'. అలాగే non schench అంటే "a drink' అని అర్థం. పై రెండు పదాలు కలిసి luncheon అంటే మధ్యాహ్న సమయంలో తీసుకొనే రొట్టె ముక్క, drinkను luncheon అని వ్యవహరించేవారు. కాలక్రమేణా మధ్యాహ్న భోజనాన్ని lunch అని వ్యవహరించడం సామాన్యమై పోయింది.

- డి.దిలీప్‌కుమార్

## ఆడ పోలీస్

పోలీసు శాఖలో మగ పోలీస్‌లు కొంత పరిమితి వరకే పరిశోధనలు చెయ్యగలరు. నేరాలు పెరిగిపోయి స్త్రీలు కూడా నేరాలు చెయ్యటం ప్రారంభించిన తరువాత స్త్రీలను సూక్ష్మంగా పరిశోధించటానికి స్త్రీ పోలీసుల అవసరం వుందని తొలిసారి ప్రపంచంలోనే ఆడ పోలీసులను అమెరికాలోని లాస్ ఏంజిల్స్ నగరంలో 1910వ సంవత్సరంలో నియమించారు.